[illegible]

[illegible]

"ఏవండీ!"

" . ..."

"అప్పుడే నిద్రపోయారా..."

మేడమీది గదిలో సోఫాలో ఓరగా పడు కుని కునుకు దీస్తూన్న భర్తవేపు క్షణంసేపు తీక్షణంగా చూసి, తను తీసుకొచ్చిన నీళ్ళ చెంబూ, గ్లాసూ కిటికీ దగ్గర పెట్టి "మీ కెప్పుడూ నిద్ర కళ్ళ మీదే కాచుకు కూర్చొ సుంటుందండీ మరీనూ!" అంది విసుగ్గా మంజుల. సోఫాలో కునుకు దీస్తూన్న మని షిలో అప్పటికీ చైతన్యం లేకపోవడం చూసి మంజుల అతని భుజాన్ని కదుపుతూ "ఏవండీ...నాచేత బ్రతిమాలించుకోనిదే లేవ గూడదనుకున్నారా ఏంటి!......గంట పడన్నా కాలేదు. అప్పుడే ఏంటీ నిద్ర! లేవండీ!" అంది బుజ్జగిస్తూ.

భానుమూర్తి బద్ధకంగా లేచి కూర్చుని అతి ప్రయత్నంతో ఆవులించడం చూసి, కొంటెగా నవ్వుతూ "అబ్బ, ఇంతసేపూ ఏదో గాఢనిద్రలో మునిగిపోయినట్టూ, యిప్పుడే మళ్లీ నిద్ర ముంచుకువచ్చే స్తూన్నట్టూ...ఏమి నటనండీ!" అంది వ్యంగ్యంగా, మంజుల చేతులు త్రిప్పుతూ.

ట్యూబులైటు కాంతిలో 'జిగేలు'మని మెరిసిపోతున్న తన ప్రియబాంధవి తెల్లటి పలువరుస చూసి మురిసిపోతూ, ఆమె పరి హాసానికి మౌనంగా మందహాసం చేసి, టేబిలు మీదున్న ప్యాకెట్‌లోని ఆఖరు సిగరెట్టు నోటికి పట్టించి వెలిగిస్తూ, "అర్ధరాత్రవు తున్నా, అమ్మగారికి పని తెమలటం లేదు ఈ మధ్య." అన్నాడు వెటకారంగా భానుమూర్తి —పరుపు సర్దుతూన్న మంజుల నుద్దేశించి.

పొడిగా నవ్వి "ఏం చేయమంటారు? ఇంటెనిండా బోలెడంత పని నా కోసం ఎప్పుడూ ఎదురు చూస్తూంటుంది. పనిమనిషి ఉన్నదని పేరేగానీ ప్రతిపనికీ నేను దగ్గర లేందే ఏదీ శుభ్రంగా చెయ్యదు," అంది మంజుల.

"ఉహూఁ!"

అది తనపట్ల నిజమైన సానుభూతి సూచక మేనా అని క్షణంసేపు మంజుల భర్తవైపు చూసింది. సానుభూతి కాదు కేవలం పరి హాసమేనని అతని క్రీగంటి చూపూ, పెదవుల మీది దరహాసమూ చెప్పేశాయి. ముఖం చిట్లించి అవలికి త్రిప్పేసుకుంటూ "అవు ళ్లండి, 'అయ్యోపాపం' అని పొరపాటుగా నన్నా ఎప్పుడూ మీ నోటెనించి రాదుగా" అంది మంజుల.

ఇంతలో "సుబ్బులూ, చూడూ ఆ తమల పాకుల పళ్లెం టేబిలుమీదే వదిలిపెట్టి మేడ మీది కెళ్లిపోయింది అమ్మాయి. ఏమి మతి మరుపు! ఏమి తొందర! కాస్సేపన్నా కాలు క్రింద నిలవదే?...ఆ పళ్లెం తీసుకెళ్లి వాళ్ళ కిచ్చిరా!" అని భానుమూర్తి తల్లి మాణిక్యమ్మ గారు, పని మనిషి సుబ్బులుని అజ్ఞాపిస్తున్న మాటలు వినబడ్డాయి.

తోడుదొంగల్లా ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు దంపతులు మేడమీది గదిలో. "మరచిపోయానండీ" గొంతుక తగ్గించి క్షమాపణ పూర్వకంగా చెప్పింది మంజుల. భానుమూర్తి సోఫాలోంచి లేచి సీరియస్‌గా ముఖం పెట్టి "ఇవ్వాల్టికి క్షమిం చేశాను. మరోసారి ఇలా చేయకేం" అని గద్దించి, వెంటనే కంఠం మార్చుకుని "భోజనం కాగానే తాంబూలం వేసుకున్నా లేకపోయినా కంగారుపడకు" అంటూ ఆప్యాయంతో భుజాల్ని కుదిపి పరుపుమీద కూర్చోకు ...

"అబ్బ బ్రతికించారు! నేనేదో..." అని మంజుల యింకా ఏదో చెప్పబోతూండగా తలుపు తట్టిన చప్పుడైంది. తలుపు తెరచి, తాంబూలం పళ్లెంతో నిలుచొనున్న సుబ్బుల్ని చూసి "యిప్పుడక్కర్లేదు సుబ్బులూ. ఆయన నిద్రపోయారు. క్రిందికి తీసుకెళ్లిపో" అని పంపించేసింది మంజుల. తలుపు గొళ్లెంపెట్టి, గ్లాసులో నీళ్లు త్రాగు తూండగా, మళ్లీ మాణిక్యమ్మగారి కంఠం ఖంగున వినిపించింది—'ఏమే మళ్లీ వెనక్కు తెచ్చేశావ్?' మరచిపోయింది గాకుండా నేనేదో జ్ఞాపకంచేసి పంపిస్తే, అది వాడికి అందనివ్వకుండా వెనక్కు పంపించేసిందా? అలిగిందేమో అమ్మాయి నామీద...వాడు నిద్రపోతూంటే పోని తనైనా వేసుకో రాదూ? ఏదో ప్రీతితో పంపిస్తే......హుఁ అయినా అమ్మాయి కళ్లల్లో నేనెంత అలుసై పోయాను!"

నీళ్ల గ్లాసు చప్పుడు గాకుండా కిటికీ దగ్గర పెట్టి మెల్లగా అడుగులో అడుగు వేసు కుంటూ భర్త ప్రక్కన చేరి "ఏవండీ విన్నారా మీ అమ్మ నన్ను ఎలా అపార్థం చేసుకుందో? నేనా మెను లక్ష్యపెట్టడం లేదుట! మీరు తాంబూలం వేసుకున్నారు గదా అని వెనక్కు పంపించేస్తే అవి మీకు అందనీకుండా చేస్తున్నానట! ప్రతి మాటకీ ఏదో విపరీతార్థం కల్పించి ఎత్తిపొడుపుగా మాట్లాడ్డం ఈ మధ్య మరీ అలవాటై పోయిం

ఉండ మీ అమ్మను... ఇంతకు క్రితం నేను ఆలశ్యంగా వచ్చానని విసుక్కున్నారు మీరు. అందుకు ఆమె ఏమందో విన్నారుగా—నాకు కాస్సేపన్నా కాలు క్రింద నిలవదట!—ఏదో నే నెల్లప్పుడూ ఈ రాజమహాలు మేడమీదే తగులడుతున్నట్టు! వింటున్నారా" అంది వింటున్నాడో లేదోనని సందేహంతో భర్తను కదిపి. భానుమూర్తి అటూ ఇటూ కదలకుండ, కళ్లుమూసుకునే "ఊఁ!" అని దీర్ఘం తీశాడు—సావకాశంగా వింటున్నట్టు.

మంజుల మళ్లీ మొదలెట్టింది. "ఎంత సర్దుకుపోదామనుకున్నా మీ అమ్మగారి తత్త్వం ఏమిటో నాకేమీ అంతు చిక్కడంలా. మొన్న నేను విపరీతమైన తలనెప్పితో బాధపడుతూంటే, మీ చెల్లెలిని స్టేషను వరకూ సాగనంపి రాలేదని, ఆ రోజు ఎంత రుసరుస లాడిందనుకున్నారు! నెల్లాళ్ళ క్రితం ఓ రోజు మాట వరసకి సుబ్బులుతో 'ఓ వారం రోజులు మా ఊరెళ్ళి నా చిట్టి తమ్ముడిని చూసిరావాలి" అని అంటూంటే మీ అమ్మ క్షణంలో ముఖం కందగడ్డలా చేసుకుని 'అమ్మగారి ఊరెళ్ళటానికి అదొక సాకు దొరికిందా నీకు? చూపు శివుసమీద, చిత్తం చెప్పులమీద అన్న సామెతగా మనిషి యిక్కడే ఉంటున్నా నీ మనస్సెప్పుడూ అమ్మగారింటిదగ్గరే ఉంటుంది గాబోలు! ఇక్కడ యిన్ని సదుపాయాలూ, సౌకర్యాలూ ఉంటున్నా అమ్మగారింటిమీది మోజు ఎప్పుడూ తగ్గదే!—అక్కడ మీ అమ్మగారేదో నీ రాక కోసం మహా పడిగాపులు పడుతూన్నట్టు' అని ఏదేదో యిష్టం వచ్చినట్టు మాట్లాడింది.. ఇంకెందుకండీ నిన్న సాయంత్రం, ప్రతిరోజూ ఆమెకు పళ్ళరసంతీసి పెట్టేదాన్ని. నాకు వంటగదిలో తీరిక లేక సుబ్బుల్ని తీసిపెట్టమన్నాను. అది రసం తీయబోతూంటే 'ఏమే అమ్మాయికి ఆ మాత్రమన్నా తీరిక దొరకలేదా. ఈ పని నీకు వప్పజెప్పింది. నువ్వాపళ్లు అక్కడే పడేసి వెళ్లు. అమ్మాయికి తీరిక దొరికినప్పుడే వచ్చి రసం తీసి పెడుతుందిగానీ' అని దాన్ని కసురుకుని, నేను స్వయంగా వెళ్ళి ఆ పని చేసి పెట్టేవరకూ తన పంతం వదలి పెట్టలా. ఇలా ప్రతి చిన్న విషయానికి సాధింపులూ, అరుపులూ, పెడబొబ్బలతో మీ అమ్మ మరీ చిరాకెత్తిస్తోందండీ ఈ సంగతులన్నీ మీతో చెబితే 'మొగుడికి గాడీలు చెప్పి నూరిపోస్తోందని' అనుకుంటుందని ఇంతవరకు మీ దగ్గరికి తీసుకురాలేదు......అయినా ఏమి విచిత్రమోగానీ ఆమెగారి ఈ విసుక్కోవడాలూ, సణుక్కోడాలూ అంతా ఓ ఆరేడు నెలలుగానే. అంతకు పూర్వం, చెప్పొకో వద్దూ, ఆమెకు నేనంటే చాల అభిమానం. ఆఁ మరచిపోయాను మరో సంగతి మొన్న.. "

"ఆఁ యివ్వాళికి చాల్లే. నోరుమూసుకుని పడుకో వెయికి. అసలే మా అమ్మకు కొత్తస్త్రీలూజు. అందులోనూ యిప్పుడు జబ్బు మనిషి. ఇక చెప్పాలా, ఆమె చెప్పేవన్నీ ఆ చెవిలో విని ఈ చెవిలోంచి వదిలి పారెయ్. తెలిసిందా..... లైటు ఆర్పేసి పడుకో యిక!" అని తన సతీమణి బాడీల పురాణానికి సడన్‌గా 'ఫుల్‌స్టాప్' పెట్టేసి ముసుగుదన్ని పడుకున్నాడు భానుమూర్తి.

మంజుల బుంగమూతిపెట్టి "అవున్లెండి. నే నేది చెప్పబోయినా మీ బుర్రలోకి ఏమీ ఎక్కదుగా. మీతో చెప్పటం నా తెలివి తక్కువగానీ" అంది లైటు ఆర్పేస్తూ.

మర్నాడు ఉదయం భానుమూర్తి ఆఫీసు కెళ్ళటానికి కార్లో కూర్చుని 'స్టార్టు' చేశాడో లేదో, ఇంటిలోపలినుంచి 'ఏవండీ!" అన్న సతీమణి సన్నని కంఠం చెవిని బడటంతోనే

ఫలించని ప్రణాళిక

చటుక్కున బ్రేకు వేశాడు. గింతుకుంటూ క్షణంలో మంజుల పోర్టికోలో ప్రత్యక్షమై, 'ఏమండీ! ఆ రిఫ్రిజిరేటరు సంగతి యివ్వాళ కూడా మరచిపోరుగా. మళ్ళీ యథాలాపంగా సాయంత్రం ఏదో ఓ కుంటిసాకు పట్రాకండి. ఎల్లాగయినాసరే యివ్వాళ ఆ కంపెనీకి వెళ్ళి దాని సంగతి తప్పకుండ తేల్చుకు రావాలి" అంది కోపం అభినయిస్తూ.

"సరే సరే, ఈ సాయంత్రం నేను క్లబ్బు కెళ్ళకుంటే, నాకు తీరిక దొరికితే, జ్ఞాపకముంటే.. చూద్దాంలే."అంటూ ఒక్కసారి చిలిపిగా మంజుల కళ్ళల్లోకి చూసి నవ్వి 'బుర్రు'మని ఉడాయించాడు భానుమూర్తి.

'అదేమీ కుదరదు. ఎల్లాగయినాసరే ఈ సాయంత్రం మర్చిపోయారా.. (చెబుతా మీ పని.)' — మంజుల వార్నింగు అందుకోకుండానే జారుకున్నాడు భానుమూర్తి.

కారులోని భర్తని కనుచూపుమేర సాగనంపి, హాల్లోకి అడుగెట్టిందో లేదో, 'ఏమిటమ్మాయ్! వాడి నలా వీధిలో నిలబడి కాకిస్తున్నావ్. ఇవ్వాళ వాడికి తీరిక లేదంటూంటే, ఏమిటా అర్థంలేని బెదిరింపు? అయినా మూడు వేలుపెట్టి ఆ పాడు రిఫ్రిజిరేటరు కొనకపోతే ఏం కొంప ముంచుకుపోయింది!' అని ఖంగున మ్రోగే కంచు కంఠంతో మాణిక్యమ్మగారు మందలించింది. రెండు క్షణాల పాటు అయోమయావస్థలో 'ఎలక్ట్రిక్ షాక్' తిన్న మనిషిలా ఉక్కిరి బిక్కిరై పోయింది మంజుల. మరుక్షణం తమాయించుకుని, ఉక్రోషం పెల్లుబికి వస్తున్నా దిగమింగుకుంటూ 'ఎందుకత్తయ్యా మీకు నా మీద అంత కోపం! నేనేమీ ఆయన్ని శాసించలేదు. ఆ సంగతి జ్ఞాపకం చేశాను. అంతే!.. అయినా ఆ రిఫ్రిజిరేటరు ముఖ్యంగా మీ కోసం తెచ్చిన పళ్లు దాచటానికేగా తెమ్మని చెప్పింది. నా స్వంతానికి కాదుగా" అంటూ అత్తగారి ముఖంలోకి కొరకొర చూసి, పమిట చెంగును విసురుగా భుజాలమీదికి లాక్కుని చరచరా, మెట్లెక్కి మేడమీది కెళ్ళిపోయింది మంజుల.

ప్రక్కన డ్రాయింగురూములో న్యూసు పేపరు దగ్గరెట్టుకుని తాపీగా 'చెస్సు' ప్రాబ్లమ్ సాల్వ్ చేసుకుంటూన్న శేషాద్రిగారు, అత్తా కోడళ్ళ మధ్య చెలరేగిన ఆరాధాంతం విని గది వెలుపలికొచ్చి భార్యతో "ఏమే! ఆ అమ్మాయితో ఎందుకలా లేనిపోని గొడవ పెట్టుకుంటావ్? ఈ సంసారం జరిపించే బాధ్యత వాళ్ళకు వదిలిపెట్టెయ్యక, ఎందుకీ జోక్యం కలిగించుకుంటావ్? అయినా నీ జబ్బును గురించి ఆ అమ్మాయ్ ఇంత శ్రద్ధ తీసుకుంటూంటే సంతోషపడాలి గానీ యిలా" అన్నారు.

'అవున్లెండి, ఎన్ని లక్షలు తెచ్చి మీ ముందర కుమ్మరించిందని అస్తమానూ యిలా ఆ కోడలమ్మాయిని వెనకేసు కొస్తూంటారు?'

'నాన్సెన్స్. నోరుమూయ్. ఎవరన్నా వింటే నవ్విపోతారు. డబ్బు తీసుకొస్తేనే నీ కోడలా, నీ వెఱ్ఱిగానీ. అమ్మాయి మన కందరికీ నచ్చితేనేగా మన కోడలైంది. వాడూ కట్నం తీసుకోకూడదన్న ఆదర్శాన్ని నిలబెట్టుకున్నందుకు తృప్తిపడ్డాడు. మన కందరికీ సంతోషమేగా."

"ఆ-ద-ర్శ-ం" — ఆవేశంతో ప్రతి అక్షరాన్నీ నొక్కి పలుకుతూ వెర్రిగా అరచింది మాణిక్యమ్మగారు. 'ఎందుకా ఆదర్శం! ఎవరికోసమా ఆదర్శం! కట్నం పుచ్చుకున్న వాళ్ళందరూ నాశనమైపోయారా, లేకుంటే వాళ్ళ ఆదర్శాలన్నీ నట్టేట గలిసి పోయాయా?"

'ఏమిటా పిచ్చివాగుడు? అయినా వాడికి పెళ్ళయి మూడేళ్లు కావస్తూ మరో ఐదారు నెలల్లో మనకో మనమడో, మనమరాలో పుట్టబోతూంటే యిప్పుడెందుకొచ్చిందీ ప్రస్తావన! ఊరుకో యిక మాట్లాడక!" అని గదిలోకి వెళ్ళిపోయారు శేషాద్రిగారు. కట్నం సంగతి యిప్పుడు తన భార్య ఎందుకు లేవదీసిందో, యితరులు ఆట్టే గ్రహించలేకపోయినా, శేషాద్రిగారి ఊహకు అందలేక పోలేదు.

*　　*　　*

మూడేళ్ళక్రితం భానుమూర్తి ఎం. ఏ. పూర్తిచేసి రిజర్వు బేంకు ఉద్యోగంలో ప్రవేశించటంతోటే, అతని పెళ్ళి ప్రయత్నాలు మొదలెట్టాయ్. శేషాద్రి, మాణిక్యమ్మ దంపతులకు ముగ్గురు సంతానం—ఇద్దరబ్బాయిలు, ఒక్కమ్మాయి. ఆ ఇద్దరబ్బాయిల్లో పెద్దవాడిని అకాలంగా టైఫాయిడు అంతం చేయగా వరలక్ష్మి, భానుమూర్తి మాత్రం మిగిలారు. వరలక్ష్మి పుట్టిల్లు వదలి అత్తారిల్లు మెట్టేసరికి శేషాద్రిగారి బేంకు నిలవలో అమాంతంగా ముప్పైవేలు జారిపోయింది.

> ఒకరు - ఏమండీ, రంగయ్య గారిల్లెక్కడండీ?
>
> మరొకరు - ఆయన కేమి పనండీ, ఇల్లెక్కడానికి?
>
> —తాడిబోయిన సాయిబాబ
> (గుంటూరు)

అయితే అమ్మాయి శ్రేయస్సు కోసం, అంతస్థు కాపాడుకోవటం కోసం ఆ మాత్రమన్నా వదులుకోక తప్పదని తృప్తిపడ్డారు శేషాద్రిగారు. 'ఈ రోజు పాతిక వేలు అమ్మాయికోసం కట్నం ఈ చేత్తోయిస్తే, రేపు అబ్బాయిపెళ్ళికి అంతకు రెట్టింపు ఆ చేత్తో రాబట్టుకోవచ్చుగదా' అనే ధైర్యంతో అమ్మాయి పెళ్లికయిన ఖర్చుకు ఆట్టే వాపోలేదు మాణిక్యమ్మగారు.

కానీ కానీ ఆమె వేసుకున్న పథకానికి, అందరిలోకీ భానుమూర్తి ఎదురుచుక్క పెడతాడని మాణిక్యమ్మగారు ఏనాడూ కలగనలేదు. భానుమూర్తి, తను పెళ్లాడే పక్షంలో కట్నం చిల్లిగవ్వయినా ససేమిరా పుచ్చుకోనని పంతంపట్టి కూర్చున్నాడు!

"రాయీ, రాయీ కలిస్తేనేగానీ కొండ కాలేదురా అబ్బాయీ! ఇవ్వాళ మన చుట్టాలు పక్కాలు మనల్ని యింతగా గౌరవిస్తున్నారంటే మన ఆస్తిని చూసేరా నాయనా! నీ బావతాలూకువాళ్ళు పాతిక వేలు నిక్షేపంగా కట్నం పుచ్చుకోలా. అయినా మనం ఏమీ అడగక్కర్లేకుండానే పిల్లతాలూకువాళ్లు కట్నమిస్తామంటూ ముందుకొస్తూంటే, పుచ్చుకోటానికి జంకుతావేమిరా!" అని మాణిక్యమ్మగారు కొడుకును ఎంతో దూరం బతిమిలాడింది. వాదించింది.

దానికి భానుమూర్తి యిచ్చిన సమాధానం ఒక్కటే "అమ్మా! నాన్న ఇన్కమ్‌టాక్స్ ఆఫీసరుగా రిటైరై లక్ష రూపాయలు ఇంటకి తెచ్చారు. చెల్లాయి పెళ్ళి ఒక పెద్ద ఖర్చనుకుంటే, అదీ సక్రమంగా అయిపోయింది. మనకు స్వంత యిల్లూ, వాకిలీ ఉంది. పైగా నా ఉద్యోగం యిప్పుడే నెలకు నాలుగు వందలు పలుకుతోంది. ఇక నా కాబోయే మామగారి దగ్గర్నించి చిల్లర డబ్బుల కెగురు మూడాల్సిన ఖర్మ మనకేం పట్టింది?"

శేషాద్రిగారు ఈ విషయంలో కుమారుడి భావాలవైపు మొగ్గారు. తండ్రీ కొడుకులు ఏకమైనా, తన అభిప్రాయాన్ని ఎంతిమాత్రమూ మార్చుకోనని భీష్మించుకు కూర్చుంది మాణిక్యమ్మగారు. రెండు మూడు మంచి సంబంధాలు, అంటే మాణిక్యమ్మగారికి నచ్చినవి, వచ్చాయ్. అయితే తల్లీ కొడుకుల మధ్య రాజీ కుదరక అవి వెనక్కి తిరిగి పోయాయ్. ఆఖరికి మంజుల సంబంధం తగిలింది. మంజుల పరంధామయ్యగారి మొదటి భార్యకు కలిగిన ఒక్కల కూతురు. ఆయన మొదటి భార్య చనిపోయిన తరువాత ఐదేళ్ళ క్రితం రెండో వివాహం చేసుకున్నాడుగాని సంతానం ఏమీలేదు. పరంధామయ్య ఆట్టే కాలేజీలలో చదువుకోకపోయినా, ఆధునిక భావాలు గలవాడు, ఉత్సాహవంతుడూ, వ్యాపారంలో స్వయంకృషివల్ల పైకొచ్చినవాడు. ఆస్తి నికరంగా యాభై వేలకు

పైచిలుకు ఉంది. మంజుల చూట్టానికి రబ్బరు బొమ్మలా మిసమిసలాడే పసిడిరంగుతో, నిండైన విగ్రహం. ఇంటర్మీడియట్ వరకూ చదువుకుంది. స్వతహాగా తెలివైన పిల్ల. అందువల్ల పరంధామయ్య తన కూతురి పెళ్ళి విషయంలో, అమ్మాయికి పదివేల పైచిలుకు నగలు తప్ప, పెళ్లికుమారుడికి కట్నరూపకంగా ఏమీ యివ్వదలచుకోలేనట్టు నిక్కచ్చిగా చెప్పాడు. అంటే కట్నాల పద్ధతిని తను పాటించగూడదని నిశ్చయించుకున్నట్టు విశదపరచాడు—ఈ సంబంధం భానుమూర్తికీ, శేషాద్రిగారికీ పూర్తిగా నచ్చింది. ఆశ్చర్యం! మాణిక్యమ్మగారుకూడ ఈ పెళ్లికి 'సై' అంది!

ఓ శుభముహూర్తాన మంజుల శేషాద్రి, మాణిక్యమ్మగార్ల కోడలైంది. క్రొత్తలో కోడలంటే మాణిక్యమ్మగారికి చాల అభిమానం. మంజుల, అత్తారింటి కెళ్ళిపోయిన, తన కూతురిస్థానం భర్తీ చేయటానికే వచ్చినదని ఎంతో మురిపెం చూపెడుతూండేది. మంజుల, యింటిపని ఏదైనా స్వయంగా చేయబోతే, ఆమెను వారించి ఆ పని పనిమనుషులకు వప్పజెప్పేది. మంజుల మేడమీది గదిలో కూర్చుని ఏదైనా నవల చదువుతూ, భోజనాలవేళ కాస్త దాటిపోయినా, చేతులు కడుక్కోటానికి నీళ్లతో సహా భోజనాన్ని మేడమీదికి సరఫరా చేయించిన రోజులున్నాయ్. ఇక యింటికి వచ్చిన ప్రతివాళ్ళతోటి తన కోడలి పుట్టుపూర్వోత్తరాలూ, అందచందాలూ, నిరాడంబరత్వం, చదువూ, అణకువ మొదలైనవి పొదిలా వల్లించి, వాళ్ళందరూ ఏదో ఓ రకంగా తన కోడలిని స్తుతించేదాకా వదలిపెడుతూండేది కాదు మాణిక్యమ్మగారు!

అలాంటి మాణిక్యమ్మగారికి, కోడలు కాపురాని కొచ్చిన రెండేళ్ళ తరువాత ఆమె మీది అనురాగం అమాంతంగా పాలపొంగులా అణగారిపోవటం మాత్రమే కాకుండ, చీదరింపుగా మారటానికి కారణం? ఈ కారణం ఎవ్వరూ పసిగట్టలేకపోయారు—ఒక్క శేషాద్రిగారిని మినహాయించి! ఆమె వైఖరి అలా ఒక్కుమ్మడిగా మారిపోవటానికి కారణం ఊహించలేక ఆదిలో చాల తికమకపడ్డారు భానుమూర్తీ మంజులానూ. కానీ కొన్నాళ్ళకు మాణిక్యమ్మగారిదేహంలో దాగుతూన్న గుండెజబ్బు మళ్ళీ ముదిరి మంచం పట్టటంతోటే, ఆమె వైఖరిలో ఏర్పడ్డ మార్పు ఆ జబ్బు పర్యవసానమేనని సమాధానపర్చుకున్నారు భానుమూర్తి దంపతులు. అందుచేత తన తల్లి, భార్యను అనవసరంగా సాధిస్తోందని తెలిసినా, ఆమె మనస్సు నొప్పించకూడదనే భావంతో తటస్థంగా ఉండిపోయాడు భానుమూర్తి. అయితే మాణిక్యమ్మగారి తత్త్వం అలా మారిపోవటానికి ఆమె గుండెజబ్బు కాదు కారణం!

అసలు కారణం? మంజుల పెళ్ళయిన రెండేళ్ళ తరువాత ఓ రోజు ఉదయం పరంధామయ్యగారి ద్వితీయ కళత్రం ఓ చక్కటి మగశిశువును ప్రసవించింది. పరంధామయ్యగారికి వంశోద్ధారకుడూ, ఆస్తికి వారసుడూ ఉదయించాడని అందరూ అతని అదృష్టాన్ని మెచ్చుకున్నారు. చిట్టి తమ్ముడు పుట్టినందుకు సంతోషంతో నాట్యం చేసింది మంజుల లేత మనస్సు.

—అయితే యిది మాణిక్యమ్మగారి ప్రవర్తనలో ఎలా మార్పును తీసుకు రాగలిగింది? మాణిక్యమ్మగారు ఆవులిస్తే ప్రేగులు లెక్కపెట్టగల మనిషి. దూరాలోచన గల వ్యక్తి. మంజుల సంబంధాన్ని, కట్నం లేకపోయినా అడ్డుపెటకుండ ఒప్పేసుకుందంటే దానికి కారణం—'పరంధామయ్య రెండో పెళ్ళి చేసుకుని ఐదేళ్ళవుతున్నా పిల్లలు కలుగలేదుగదా, యిక ఆయనకు సంతాన ప్రాప్తిలేదు. మంజుల పెళ్లికి కట్నమిచ్చినా యివ్వకపోయినా, అతని ఆస్తి అంతా, అతని తరువాత విధిగా మంజులకేగా దక్కుతుంది' అనే ఆమె ఆలోచన! కానీ .. కానీ... ఆమె మనస్సులో గూడుకట్టుకుని ఉన్న ఆ ప్రణాళిక, పరంధామయ్యగారి రెండో భార్య గర్భవతి అయిందని తెలియగానే కాస్త చెదరిపోయింది. 'అయినా పుట్టబోయేది ఆడపిల్లయితే ఆట్టే నష్టమేమీ ఉండదులే' అని మనస్సు దిటవు పరచుకుంది. కానీ, మంజులకు సవతి తమ్ముడు కలగటంతోటే ఆమె మనస్సులోని గూడు నామరూపాలులేకుండా చితికిపోయింది. నిక్షేపంగా తన వంశానికి దక్కుతుందనుకున్న పరంధామయ్యగారి ఆస్తి హఠాత్తుగా చేజారిపోయినందుకు ఆమె మనస్సు అల్లకల్లోలమై ఆ కాకిడి మంజుల మీద ద్వేషంగా రూపొందింది.

చిత్రకారుడు. చెరుకూరి గురవయ్యా నాయుడు (పాకాల.)

* * *

మంజుల ఆడపిల్లను ప్రసవించిందనీ, తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారనీ, ఓరోజు పరంధామయ్యగారివద్దనుంచి భానుమూర్తికి టెలిగ్రాము వచ్చింది. అమ్మకూ, నాన్నకూ ఆ శుభవార్తను అందజేశాడు. ఇంటిల్లిపాదీ ఆ రోజు ఎంతో సంబరపడ్డారు. మాణిక్యమ్మగారు, ప్రత్యేకించి మనమరాలు కలిగినందుకు ఉప్పొంగిపోయింది. "మహాలక్ష్మి పుట్టిందిరా నీకు" అని కుమారుడికి తన ఆనందాన్ని వెలిబుచ్చింది. హఠాత్తుగా మళ్ళీ మాణిక్యమ్మగారిలో ఉబికిన ఈ ఉత్సాహానికీ, ఆనందానికీ మరేదయినా కారణం ఉండేమోనని అనుమానపడబోయారు తండ్రీ, కొడుకులు.

"ఐదవమాసం తరువాత తల్లీ, బిడ్డను అత్తారింటికి పంపించదలచుకున్నట్టు" పరంధామయ్య జాబులో వ్రాశాడు.

"అంత ఆలశ్యం ఎందుకూ? మూడోమాసం తరువాత యిక్కడికి పంపించమని వ్రాయి. ఇక్కడ యిల్లంతా చంటిపిల్లలు లేకుండా కావురుమంటోంది. నాకూ ఏమీ ప్రొద్దుపోవటంలా. చిట్టితల్లిని త్వరగా చూడాలి" అని మాణిక్యమ్మగారు తన ఆతురతను కుమారుడికి వెలిబుచ్చింది.

ఇన్నాళ్లూ కోడల్ని వేపుకుతింటూ, కాన్పుకు అమ్మగారింటికి వెళ్లి రెండు నెలలయినా ఏనాడూ కోడలు యోగక్షేమాలను గురించి అడగని తన తల్లి, మంజుల ఆడపిల్లను ప్రసవించిందని తెలియటంతోటే యింత హంగామా చేస్తోందో, 'ఎంత చపల చిత్తపు మనిషి' అని ఆశ్చర్యపడకపోలేదు భానుమూర్తి. అయినా ఎక్కువసేపు ఆట్టే ఆలోచించక 'ఆడవాళ్ళ మనస్సు యింతే గాబోలు! క్షణంలో గుర్తుపట్టుకోలేనంతగా మారిపోతుంది' అని అనుకున్నాడు.

మూడు నెలల తరువాత మంజుల, బిడ్డ అత్తారింటి కొచ్చారు. పరంధామయ్య తీసుకొచ్చి వదలిపెట్టి పోయాడు. మనిషి అస్వస్థతగా ఉన్నా కొడుకుతోటి స్టేషనుకెళ్లి, కోడల్నీ, మనుమరాల్నీ స్వయంగా యింటికి తీసుకొచ్చింది మాణిక్యమ్మగారు. స్టేషనునించి యిల్లు చేరేవరకూ ఆమె కారులో మనమరాల్ని తన ఒడిలోంచి కదలనిస్తే ఒట్టు!

ఆరోజు రాత్రి మంజుల మేడమీది గదిలో బిడ్డను పడుకోబెట్టి భర్తతో కబుర్లాడుతూ "ఏమండీ నేనిక్కడ్నించి వెళ్లింతర్వాత మీ అమ్మగారు చిర్రుబుర్రులాడటం మానేసిందా? ఇప్పుడు చూస్తే మళ్ళీ మామూలు మనిషైపోయినట్టుందే?" అంది.

పూర్వ మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా ఫలాచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మా అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి

Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

చలిగాలికి మీ గొంతుక లోపల కూడా రక్షణ కావలసి ఉంటుంది

జలుబు, గొంతురాపిడి, మింగేటప్పుడు నొప్పి ఇవన్నీ సాధారణమైన చలిగాలి జబ్బులు వాక్స పాస్టిల్స్ మీ గొంతుక లోపల, వెచ్చదనాన్ని కల్గించి సంసర్గాన్ని నివారిస్తుంది. వెంటనే ఉపయోగించుకోడానికి ఎప్పుడూ ఒక డబ్బాను చేతిలో ఉంచుకోండి.

వాక్స పాస్టిల్స

ప్యారీస్ కన్ ఫెక్షనరీ లిమిటెడ్, మద్రాసు

JWT/PRS/V-1165

ఫలించని ప్రకాశిక

"ఆఁ ఆఁ! నువ్వు ప్రసవించిన తరువాత అదేపనిగా నిన్నుగురించీ, పాపను గురించి తలపోయటం మొదలెట్టింది. ముఖ్యంగా పాపను త్వరగా చూడాలని వాపోతూండేది!

ఈ మాటలు విని మంజుల చిరునవ్వుతో, నిద్దరోతున్న పాప చెక్కిళ్ళను ఆప్యాయంగా నిమిరి 'ఫరవాలేదు' అయితే మరి మన పాప ఆమెలో చాలమార్పు తీసుకొచ్చిందన్నమాట!' అంది.

'ఆఁ! తప్పకుండా. ఇకమీద ఆమె నిన్ను కోప్పడినప్పుడల్లా నువ్వు నిస్సంకోచంగా పాపచాటున దాక్కోవచ్చు' అన్నాడు భానుమూర్తి.

మర్నాటినించి మాణిక్యమ్మగారు మనమరాలికి 'దాసురాలై'పోయింది. మనమరాలు కాస్త 'కయ్‌' అంటే చాలు ఆమె కర్ణపుటాలు అదిరిపోయి 'అమ్మాయ్‌, మంజులా, ఏం జేస్తున్నా వక్కడ? ఇక్కడ చిట్టితల్లి ఏడుస్తోంటే. ఆ పనేదో సుబ్బులికి వప్పజెప్పి త్వరగా యిటు రామ్మా' అని పురమాయించేది. ఉదయం మొదలు రాత్రివరకు, ?పకు పాలు పట్టడం మొదలుకుని, స్నానం చేయించి నిద్రపుచ్చడం వరకు టైము ప్రకారం జరిపించడం ఆమెవంతు.

మాణిక్యమ్మగారు గుండెజబ్బుతో మంచం పట్టి రాదాపు సంవత్సరం దాటింది. జబ్బు మొదట్లో కాస్త తగ్గుముఖం పట్టినా తరువాత ఆట్టే నెమ్మదించలేదు. ఓ నాడు సాయంత్రం ఆమె స్నానాల గదిలోకి వెళ్ళబోతుండగా స్పృహతప్పి నేలమీదికొరిగింది. వెంటనే సుబ్బులూ మంజులా ఆమెను మంచం మీదికి చేరవేసి డాక్టరును పిలిపించారు. డాక్టరు ఇంజెక్షను యిచ్చి మళ్ళీ ఉదయం వస్తానన్నాడు మరుసటిరోజు ఉదయం మాణిక్యమ్మగారిని బాగా పరీక్షచేసి వెలుపలికొచ్చి భానుమూర్తినీ, శేషాద్రిగారినీ నాటుగా పిలచి, పెదిములు విరిచి 'ఇక రెండు మూడురోజులు మాత్రమే' నని వెళ్ళిపోయాడు. తండ్రీ, కొడుకులకి గుండెలు అమాంతంగా దిగజారిపోయాయ్

పెళ్ళిగాములు అందరు ఆ ప్రబంధువులకూ వెళ్ళాయ్. మాణిక్యమ్మగారి పరిస్థితిని పరామర్శించటానికి గుంపులు గుంపులుగా బంధువులు వచ్చిపోతున్నారు. మాణిక్యమ్మగారికి ఈ రెండు రోజుల్లో మూడుసార్లు మళ్ళీ స్పృహతప్పింది. మూడోసారి తెలివి వచ్చిన తరువాత ఆమె మంజులను దగ్గరికి పిలిచి "ఏమమ్మా మీ నాన్న రాలేదా? ఎప్పుడొస్తాడు? చూడాలని వుంది" అని చెప్పింది.

“తెల్లీగ్రాం యిచ్చారత్తయ్యా, బహుశా ఈ రాత్రి మెయిలుకు రావచ్చు.”

అనుకున్న ప్రకారమే రాత్రి మెయిల్లో పరంధామయ్య దిగారు. శేషాద్రిగారితోనూ భానుమూర్తితోనూ ముసలావిడ పరిస్థితిని గురించి మాట్లాడి హాల్లోకి అడుగెట్టాడు. గ్లాసులో మంచినీళ్లు యిస్తూ “నాన్నా! మీరింకా రాలేదా అని అడిగింది అత్తయ్య. వెంటనే వెళ్లి చూడండి” అంది మంజుల.

‘పరంధామయ్యగారు గదిలోనికి అడుగెట్టేసరికి మాణిక్యమ్మగారు ఆమె మంచం చుట్టూ చేరిన నలుగురైదుగురు బంధువులతో ఏదో మెల్లిగా మాట్లాడుతూ, వాళ్ళ చేతుల్లో ఉన్న పాపతో పరిహాసాలాడుతోంది. ఇంతలో మంజుల వచ్చి “అత్తయ్యా, నాన్నొచ్చారు” అని చెప్పటంతోటే ఆమె కళ్లు ఆనందంతో మెరిశాయి. పాలిపోయి వణుకుతూన్న ఆమె పెదాలమీద చిరునవ్వు తొండవించింది. లేవటానికి ప్రయత్నం చేయబోగా, పరంధామయ్య ‘ఆఁ, ఆఁ ఏమీ ఫరవాలేదు శ్రమపడకండి’ అని పడుకోబెట్టి ‘ఎలాగుంది మీ ఒంట్లో’ అనడిగాడు. ‘ఇలాగుంది నాయనా’ అని అంటూండంగా మాణిక్యమ్మగారి ముఖం ముడుచుకుపోయి ఆమె కనుకొలకుల్లోంచి రెండు అశ్రువులు ఉబికాయి.

మనమరాల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ పరంధామయ్య ‘మీరలా అధైర్యపడకూడదు. డాక్టరు మంచి మందులిస్తున్నాడనివిన్నాను. జబ్బు త్వరలో నెమ్మదైపోతుందిగా’ అని ధైర్యం చెప్పాడు.

కాస్సేపు నిశ్శబ్దం. కన్నీటి చుక్కలు తుడిచేసుకుని పరంధామయ్యను తన దగ్గరకు రమ్మని సైగచేసి మాణిక్యమ్మ తడబడుతున్న కంఠంతో ‘నాకిక ఆశలేదు నాయనా. కానీ నాకు ఒక్క కోరిక మాత్రం మిగిలిపోయింది. అది కాస్త, నెరవేరుస్తానని మాటివ్వాలి’ అని అడిగింది.

‘సరే’నన్నట్టు తలూపాడు పరంధామయ్య.

పాపకేసి చూపెడుతూ ‘అదిగో నా చిట్టితల్లిని తప్పకుండ నీ కోడలుగా చేసుకోవాలి నాయనా. ఇదే నా కోరిక – కాదనకు’ అని అతని చేతులు తాకింది మాణిక్యమ్మ. పరంధామయ్య పాపను ముద్దెట్టుకుని, చిరునవ్వుతో ‘సరే అలాగే. మీరేమీ బెంగెట్టుకోకండి’ అని పాపను తీసుకుని గది వదలి వెళ్లిపోయాడు. మంచంచుట్టూ ఉన్న బంధుజనం ‘ముసలావిడకు ఎంతలావు ఆలోచన! తను చావబోతున్నా పరంధామయ్యగారి ఆస్తి పరాయి వాళ్ళకు దక్కనివ్వగూడదని ఎంత పెద్ద కోరిక కోరిందీ!’ అని గుసగుసలాడుకున్నారు!

మర్నాడు ఉదయం మళ్లీ మాణిక్యమ్మగారికి స్పృహ తప్పింది. ఆమె శరీరంలో చిరకాలంగా స్థావరం ఏర్పరచుకున్న మమతలూ, ఆలోచనలూ, ఆశలు ఒక్కసారిగా బహిర్గతమైపోయాయి శాశ్వతంగా! ★